# రెండో కాలు

*** రచన: "నిశి" ***

"ఒరేయ్ వాసూ, నేను ఫైటర్‌లో చెట్ల మీంచి తిరుగుతున్నా కదూ! అడవులూ, కొండలూ ఎలా నా కింద పరిగెడుతున్నాయో? నువ్వూ రారా నా దగ్గిరికి?"

"........"

"ఒరేయ్, చవటా మాటాడవేం? నిన్ను కాదూ నే అడుగుతూంట?

ఆఖరుసారి అడుగుతున్నా, ఖచ్చితంగా చెప్పు-నువ్వీ విమానంలోకి వొస్తావా రావా?

"....."

మాటాడవేంరా గాడిదా! నీ పీక పిసికేస్తా!... ఇదేవిట్రా లేవలేకండా ఉన్నాను! ఒరేయ్ శ్రీనూ, నే కదల్లేకండా ఉన్నాను. ఎంచేత?"

"ఏం లేదు—అలా ఉండు."

"ఏంలేదేవిట్రా? ఏంలేదేవిటీ? నే కదల్లేక పోవడానికి కారణం అడుగుతే ఏం లేదంటావా? ఒస్తున్నా నీ, పదహారు పళ్ళూ రాలకొడ్తా... ఒరేయ్! నా కాలేదీ?? నా కాల్లా...కనపడదు! ఏదీ అది?"

"మాటాడకండా పడుకో—గొడవ చెయ్యక—"

"గొడవేవిట్రా? గొడవేవిటి? నా కాలు విషయమై అడగడం గొడవా? ప్రపంచానికేవిధంగానూ-ఉపకరించని పీనిగలు—నా కాలేదీ అంటే చెప్పలేని ఓ వాజమ్మా—"

"ఎందుకలా అరుస్తావు? నీ..."

"అరుస్తున్నానా? అయితే సావధానంగా అడుగుతున్నా—చెప్పు. చూడు నాకు చిన్నప్పట్నించీ రెండు, కాళ్లుండేవి తెలిసిందా? నీ కర్మం కాదులే—అందులో ఇలాటి విషయాలు—అసలే తెలీదు తక్కువ మనిషివి—మా అమ్మకూడా చెప్పేది, నాకు రెండు కాళ్లుండేవని—అందులో—అంటే ఆ రెండు కాళ్ళలో—వేళ్లలో అనుకునేవు, మట్టి తలకాయ!—ఒకటి—అక్షరాలా ఒకటి కనబడ లేదు—అది ప్రస్తుతం ఎక్కడ ఉన్నదో, ఎందుకిక్కడలేదో తక్షణం చెప్పు?"

"ఇస్...ఊరుకో తర్వాత చెబుతా"

"ఏం నాయనా! అంత విసుగేం? నా కాలు విషయమై నే నడక్కూడదూ? అట్లాంటిక్ చార్టర్ రోజుల్లో! నీకు కొన్ని విషయాలు చెప్పాలి. అను, అట్లాంటిక్ చార్టర్ ప్రకారం—అనవేం? పెళ్ళి పీటమీద ఆ వెధవ పురోహితుడు చెప్తున్న నాన్సెన్సంతా చెప్పగలవూ? నే చెప్పబోయే యీ వేదాక్షరాలు ఉచ్చరించలేవూ? నీ—"

బాబోయ్! నా చెవులు బద్దలు కొట్టకు. నువ్వేం చెయ్యమన్నా చేస్తాను—ఆఁ. అట్లాంటిక్ చార్టరు ప్రకారం..."

"అఁ. అలా తోవలోకిరా. ప్రతి ఆంధ్రుడికీ—ఛీ వెధవ సంకుచిత్వం! ప్రతి భారతీయుడికీ—ఛీ మళ్ళా అదే—ఒకొక్కప్పుడు అజ్ఞానం నాకు చిన్న మమతలా కప్పుతుందిలే-అట్లాంటిక్ చార్టరు ప్రకారం ప్రతి మానవుడికీ—"

"ప్రతి మానవుడికీ..."

"రెండు కాళ్ళుంచుకోవడం జన్మహక్కు. ఆ సదరు రెండు కాళ్ళలోనూ ఏ ఒక్కటి కనబడక పోయినా పక్కనున్న శ్రీనిగాడి కణత బద్దలు గొట్టడం అంతకన్నా జన్మహక్కు. కాబట్టి నా హక్కుల్ని నేను కాపాడుకుంటున్నా. నా కాలెక్కడుందో చెప్పకపోతే మిమ్మల్నందర్నీ మెషీన్‌గన్ చేసేస్తా...చెప్పు లేకపోతే నీ—"

"అరకాన్ అడవుల్లో మిత్రమండలి విజయానికి నీ కాలు సమర్పించేవేవని ఎన్నిసార్లు చెప్పను??"

"ఆఁ! ఆఁ!. అయితే మరో విస్కీ, సోడా ఇలా పార్శియ్..."